ప్రకటనలు ఘనం..
పారిశుధ్యం అధ్వానం


కరంటంపాడులో జాతీయ రహదారి పక్కన పేరుకుపోయిన చెత్త

- అలంకారప్రాయంగా సంపద తయారీ కేంద్రాలు
- పంచాయతీల్లో పేరుకుపోతున్న చెత్త

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు డివిజన్ పరిధిలోని పంచాయతీల్లో పారిశుధ్యం పడకేసింది. ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయి దర్శనమిస్తోంది. ఇళ్ల మధ్యన మురుగు నిల్వ చేరి దుర్గంధం వెదజల్లుతోంది. ఇంటింటి చెత్త సేకరణ అటకెక్కింది. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. పారిశుధ్యంపై కూటమి ప్రభుత్వ ప్రకటనలు ఘనంగా ఉన్నా..క్షేత్ర స్థాయిలో పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంటోంది. దీంతో ప్రజలు విషజ్వరాల బారిన పడుతూ లక్షలకు లక్షలు ఆస్పత్రులకు ఖర్చు చేస్తున్నారు.

అలంకార ప్రాయంగా..
పంచాయతీల్లోని ఇంటింటి చెత్తను సేకరించి వర్మికం పోస్టుగా మార్చడం ద్వారా పారిశుధ్యాన్ని మెరుగుపరడంతో పాటు పంచాయతీల ఆదాయాన్ని పెంపొందించే లక్ష్యంతో సంపద కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందుకోసం వెయ్యి మంది జనాభాకు ఒక గ్రీన్ అబాసిడర్‌ను నియమించారు. గ్రీన్ అంబాసిడర్ ఇంటింటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సంపద తయారీ కేంద్రానికి తరలించాలి. కేంద్రంలో ఉండే గ్రీన్‌గార్డు తరలించిన చెత్తను వర్మీకం పోస్టుగా మార్చాలి. దాన్ని రైతులకు విక్రయించడం ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూరేలా ఏర్పాట్లు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పారిశుధ్యంపై శ్రద్ధ చూపకపోవడంతో సంపద కేంద్రాలు అలంకార ప్రాయంగా మారాయి. ఫలితంగా గ్రామాల్లో చెత్త నిల్వలు పేరుకుపోయాయి. ఇటీవల ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులను పారిశుధ్య పనులకు వినియోగిస్తామని, ప్రజారోగ్యానికి మంచి రోజులు వచ్చాయని ఆర్భాటంగా ప్రకటనలు చేస్తున్నా ఆచరణలో పురోగతి లేకపోవడం ప్రజల పాలిట శాపంగా మారింది.


కరటంపాడు బస్టాండ్ సెంటర్‌లో మురుగులో ప్లాస్టిక్ వ్యర్థాలు

గ్రీన్‌అంబాసిడర్లకు జీతాలెలా?
పంచాయతీల్లో ప్రతి వేయి మంది జనాభాకు గ్రీన్ అంబాసిడర్‌ను నియమించి చెత్త సేకరణ చేయాలని ప్రభుత్వ మార్గదర్శకాలు ఉన్నాయి. అయితే గ్రామ పంచాయతీల ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. నిత్యావసరాలైన తాగునీరు, వీధి దీపాలు, తదితర కార్యక్రమాలకే ప్రభుత్వ నిధులతో సంబంధం లేకుండా చాలా పంచాయతీల్లో అవసరమైన చర్యలు చేపడుతున్నారు. పారిశుధ్య కార్యక్రమాలకు గ్రీన్‌అంబాసిడర్లకు ప్రతి నెలా కనీసం ఒక్కొక్కరికి రూ.5వేలకు తగ్గకుండా వేతనం ఇస్తేగానీ చెత్త సేకరించలేని పరిస్థితి. ఈ లెక్కన ముగ్గురు గ్రీన్ అండాసిడర్లు, ఒక గ్రీన్‌కార్డు విధులు నిర్వహిస్తే నెలకు రూ.20వేలు వారి జీతాలకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. అయితే ప్రభుత్వం మున్సిపాలిటీల్లోని పారిశుధ్య కార్మికులకు జీతాలు ఇస్తుండగా, పంచాయతీల్లో సర్పంచ్‌లే పంచాయతీ నిధుల నుంచి ఇవ్వాల్సి ఉండడంతో తమ వల్ల కాదంటూ వారు చేతులెత్తేస్తున్నా రు. ప్రధానమైన ఈ సమస్యను పక్కనబెట్టి ప్రభు త్వం చేస్తున్న ప్రకటనలు ఆచరణ సాధ్య మవ్వడం కష్టమే.

ఇదీ సంపద కేంద్రాల పరిస్థితి
ఆత్మకూరు డివిజన్ పరిధిలోని తొమ్మిది మండలాలు ఉన్నాయి. అనంతసాగరం మండలంలో 25 పంచాయతీలు ఉండగా, 17 పంచాయతీల్లో మాత్రమే సంపద తయారీ కేంద్రాలు ఉన్నాయి. అందులో ఆరు కేంద్రాలు పూర్తిస్థాయిలో పనిచేస్తుండగా, మిగిలిన 9 కేంద్రాలు పాక్షికంగా ఉన్నాయి. రెండు చోట్ల పూర్తిగా పనిచేయడంలేదు. అనుమసముద్రంపేట మండలంలో 19 పంచాయతీలు ఉండగా, 14 పంచాయతీల్లో మాత్రమే కేంద్రాలను ఏర్పాటు చేశారు. అందులో 5 పాక్షికంగా పనిచేస్తుండగా, మిగిలినవి పూర్తిగా పనిచేయడం లేదు. ఆత్మకూరు మండలంలో 21 పంచాయతీలు ఉండగా, 17 పంచాయతీల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. అందులో పాక్షికంగా 14, పూర్తి స్థాయిలో 3 కేంద్రాలు పనిచేస్తున్నాయి. చేజర్ల మండలంలో 26 పంచాయతీలు ఉండగా, 19 పంచాయతీల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. అందులో పాక్షికంగా 11, పూర్తి స్థాయిలో నాలుగు కేంద్రాలు పనిచేస్తున్నాయి. 7 కేంద్రాలు అసలు పనిచేయడంలేదు. మర్రిపాడు మండలంలో 24 పంచాయతీలు ఉండగా, 15 పంచాయతీల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. అందులో పూర్తిస్థాయిలో 6, పాక్షికంగా 7 కేంద్రాలు పనిచేస్తున్నాయి. 9 కేంద్రాలు నిర్వహణ లేక మూలనపడ్డాయి. సంగం మండలంలో 20 పంచాయతీలు ఉండగా, 9 పంచాయతీల్లో కేంద్రాలు ఏర్పాటు చేశారు. అందులో పాక్షికంగా ఏడు, పూర్తిస్థాయిలో ఒకటి పనిచేస్తున్నాయి. సీతారామపురం మండలంలో 14 పంచాయతీలు ఉండగా, 12 పంచాయతీల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. అందులో పాక్షికంగా 9, పూర్తి స్థాయిలో 3 కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఉదయగిరి మండలంలో 17 పంచాయతీలు ఉండగా, 15 పంచాయతీల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. అందులో పూర్తి స్థాయిలో 12, పాక్షికకంగా 2 కేంద్రాలు పనిచేస్తున్నాయి. కలువాయి మండలంలో 20 పంచాయతీలు ఉండగా, 18 పంచాయతీల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. అందులో పూర్తిస్థాయిలో 3, పాక్షికంగా 12 పనిచేస్తున్నాయి.


వెన్నవాడలో ముళ్ల పొదల మధ్యన సంపద తయారీ కేంద్రం


చెత్త నిల్వ తొట్టిల్లో మొలిచిన పిచ్చిచెట్లు

15 నుంచి పారిశుధ్య ప్రణాళికలు

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 15వ తేదీ నుంచి గ్రామ స్థాయిలో పారిశుధ్య కార్యక్రమాల అమలుకు కార్యాచరణ సిద్ధం చేశాం. గ్రామ స్థాయిలో ఇందుకు అవసరమైన విధివిధానాలపై పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు ఇచ్చాం. స్థానిక సర్పంచ్‌లను సమన్వయం చేసుకొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తాం.

– షేక్ నయీం తాజ్‌హసన్, డివిజనల్ పంచాయతీ అధికారి

క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



ఉదయగిరి: ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డిని బ్రాహ్మణపల్లిలోని ఆయన నివాసంలో ఉదయగిరి నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన ముర్తుజాహుస్సేన్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఆయన వెంట ఉదయగిరి నాయకులు గడియాల్చి యస్దాని, గొల్లపల్లి తిరుపతి, ఎంఏ రియాజ్, ఉప్పుటూరి శ్రీను, అక్కుల్‌రెడ్డి, టింకర్ బాబు, తదితరులు ఉన్నారు.

చెరువులోని చెట్ల వేలం



కొండాపురం : మండలంలోని సాయిపేట చెరువులోని చెట్లను ఇరిగేషన్ అధికారులు బుధవారం వేలం వేశారు. గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన బహిరంగ వేలంలో 12మంది రైతులు రూ.10వేలు చొప్పున ధరావత్తు చెల్లించి పాల్గొన్నారు. సాయిపేట గ్రామానికి చెందిన ఉన్నం నవీన్ రూ.4.66లక్షలకు చెట్లను వేలంలో దక్కించుకున్నారు. ఇరిగేషన్ ఏఈ రమేష్, వెంకట్రావు, చెరువు చైర్మన్ తాటికొండ ప్రవీణ్, గంటా నరసింహులు, వల్లూరు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

డీఎల్‌పీఓ బాధ్యతల స్వీకరణ



ఆత్మకూరురూరల్: ఆత్మకూరు డివిజనల్ పంచాయతీ అధికారిగా షేక్ నయీం తాజ్‌హసన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీఎల్‌పీఓగా పనిచేస్తున్న నారాయణ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో తాజ్‌హసన్‌ను నియమితులయ్యారు. నూతన డీఎల్‌పీఓను పంచాయతీరాజ్ శాఖకు చెందిన పలువురు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. డీపీఓ కార్యాలయం అధికారి గంగవరపు శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

కారును ఢీకొన్న లారీ




వరికుంటపాడు: లారీ అదుపుతప్పి ఎదురుగా వస్తున్న కారును ఢీకొన్న ఘటన మండలంలోని తిమ్మారెడ్డిపల్లి వద్ద జాతీయ రహదారిపై బుధవారం చోటు చేసుకుంది. వివరాలు.. ప్రకాశం జిల్లా పామూరు నుంచి వైఎస్సార్ జిల్లా బద్వేల్‌కు కర్రలోడుతో వెళ్తున్న మినీలారీ తిమ్మారెడ్డిపల్లె బ్రిడ్జిపై ఉన్న గుంతలను తప్పించబోయి అదుపుతప్పి దుత్తలూరు నుంచి పామూరు వైపు వెళ్తున్న కారును ఢీకొంది. ఈ ఘటనలో కారులోని ముందు భాగంగా దెబ్బతినగా, అందులోని ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

వైభవంగా మాఘపౌర్ణమి వేడుకలు



సంగం: స్థానిక తిరుమనకొండపై ఉన్న రాజరాజేశ్వరిదేవి జ్ఞానపీఠంలో పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి ఆధ్వర్యంలో మాఘ పౌర్ణమి వేడుకలను బుధవారం వైభవంగా నిర్వహించారు. కాశీవిశ్వేశ్వరస్వామి, రాజరాజేశ్వరిదేవికి విశేషాభిషేకాలు, పూజలు, హోమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణస్వామి వ్రతం



సంగం: మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని సంగంలోని కామాక్షిదేవి సమేత సంగమేశ్వర స్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాన్ని బుధవారం నిర్వహించారు. అధిక సంఖ్యలో దంపతులు హాజరై భక్తిశ్రద్ధలతో వ్రతాన్ని ఆచరించారు.

గేట్ల రోప్‌లు మార్చకుంటే సోమశిలకు ముప్పే

- జలవనరుల శాఖ సాంకేతిక సలహాదారులు కన్నయ్యనాయుడు

సోమశిల: సోమశిల జలాశయాన్ని రాష్ట్ర జలవనరుల శాఖ సాంకేతిక సలహాదారు కన్నయ్యనాయుడు బుధవారం సందర్శించారు. జలాశయం గేట్ల స్థితిగతులను పరిశీలించారు. అనంతరం జలాశయం సమీపంలోని అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 1985లో నిర్మించిన జలాశయం గేట్లకు ఉన్న రోప్‌లను ప్రతి 15 సంవత్సరాలకు ఒకసారి మార్చి కొత్తవి వేయాల్సి ఉందన్నారు. ప్రస్తుతం రోప్‌లు నీళ్లలో ఉండడంతో బాగా తుప్పుపట్టి ఉన్నాయని, జలాశయం నీటిమట్టం పూర్తిస్థాయికి చేరుకుంటే గేట్లు లేస్తాయో..లేదోనని అనుమానంగా ఉందన్నారు. ప్రస్తుతం జలాశయంలో నీరు అధికంగా ఉన్నందున తుప్పును శుభ్రం చేయడం నీటిలో వెల్డింగ్ చేసే అండర్ ఆర్మీ డ్రైవర్స్ మాత్రమే చేయగలరన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో నివేదికను సిద్ధం చేసి ఉన్నామని, త్వరలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఆయన వెంట జలాశయం ఎస్ఈ బసిరెడ్డి వెంకటరమణారెడ్డి, ఈఈ దశరథరామిరెడ్డి, డీఈ రవీంద్రప్రసాద్, జేఈఈలు, తదితరులు ఉన్నారు.


గేట్ల రోప్‌లను పరిశీలిస్తున్న కన్నయ్యనాయుడు

సీసీ కెమెరాలతో నేరాల కట్టడి

సోమశిల: సీసీకెమెరాలతో నేరాలను కట్టడి చేయవచ్చని ఆత్మకూరు సీఐ గంగాధర్ తెలిపారు. అనంతసాగరం మండలం వెంగంపల్లి, కొత్తూరు గ్రామాల్లో పోలీసుల పల్లె నిద్ర కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సైబర్ నేరాలు, రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ ఇళ్లలో సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసుకోవడం ద్వారా దొంగతనాలను అరికట్టవచ్చని తెలిపారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నా పోలీసులకు సమాచారం అందజేయాలని కోరారు. ఆయన వెంట అనంతసాగరం ఎస్సై సూర్యప్రకాష్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.


కొత్తూరులో అవగాహన కల్పిస్తున్న సీఐ గంగాధర్

చిన్నారికి ఆర్థిక సాయం

ఆత్మకూరు: తల్లిదండ్రులను కోల్పోయిన ఏడేళ్ల చిన్నారి నాగజ్యోతికి సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి బుధవారం రూ.12వేలు ఆర్థిక సాయం అందజేశారు. పట్టణానికి చెందిన హజరత్తయ్య రెండ్రోజుల క్రితం మృతి చెందారు. ఆయన కుమార్తె నాగజ్యోతికి ఆర్థిక సాయం అందజేస్తున్న క్రమంలో ఏడాది వ్యవధిలోనే తల్లిదండ్రులను కోల్పోయిన విషయాన్ని తెలుసుకుని చలించిపోయారు. చిన్నారి ఖర్చులకు నెలకు రూ.వేయి చొప్పున రూ.12వేలు అందజేశారు. భవిష్యత్‌లోనూ తన వంతు సాయం అందజేస్తానని హామీ ఇచ్చారు. అలాగే పట్టణంలోని చావడి సెంటర్‌కు చెందిన షేక్ షాన్‌వాజ్ ఊపిరితిత్తుల వ్యాధితో మంచానికే పరిమితమైన విషయం తెలుసుకుని నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, రూ.10వేలు నగదు అందజేశారు. ఇలా మూడు నెలల పాటు సాయం అందజేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట ట్రస్ట్ సభ్యులు అచ్చోలు నరసింహారెడ్డి, రాంపల్లి ప్రసాద్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.


చిన్నారికి చెక్కు అందజేస్తున్న పరమేశ్వరరెడ్డి

రక్తదానం సామాజిక బాధ్యత

కావలి: స్వచ్ఛంద రక్తదానం ఒక సామాజిక బాధ్యత అని జిల్లా ప్రజా రవాణాధికారి మురళీబాబు పేర్కొన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా కావలి డిపో గ్యారేజ్ ఆవరణలో బుధవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. దాదాపు 100 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ శిబిరాన్ని మురళీబాబు ప్రారంభించి మాట్లాడారు. మంగళవారం నెల్లూరు, కందుకూరులో రక్తదాన శిబిరాలు నిర్వహించగా కార్మికులు అధిక సంఖ్యలో రక్తదానం చేశారని తెలిపారు. కావలిలో కార్మికులతో పాటు కుటుంబ సభ్యులు తరలి వచ్చి రక్తదానం చేయడం విశేషమన్నారు. అనంతరం కావలి డిపోలో అధికసార్లు రక్తదానం చేసిన పేరం సుబ్బారావు, కే రవికుమార్, శ్రీనివాసులు రెడ్డి, 16వ సారి రక్తదానం చేసిన ఆర్టీసీ ఉద్యోగి కుమారుడు డాకారపు నచికేత్‌ను అభినందించారు. డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు, అసిస్టెంట్ మేనేజర్లు మారంరెడ్డి కల్పనారెడ్డి, ఖాజామొహిద్దీన్, ట్రాఫిక్ సూపరింటెండెంట్ రామకృష్ణ, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ డీ రవిప్రకాష్, ఉద్యోగ సంఘ నాయకులు టీ రఘునాథరెడ్డి, పీ చెంచురామయ్య, వెంకటేశ్వర్లు, విజయం బాబు, కేవీ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.


రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మురళీబాబు

క్యాంపస్ ఎంపికలు

ఆత్మకూరు: పట్టణంలోని ఏఎస్సార్ డిగ్రీ కళాశాలలో బుధవారం క్యాంపస్ ఎంపికలు నిర్వహించారు. ఎస్ఎంసీ, మహేంద్ర ఇన్ఫోటెక్ కంపెనీల ప్రతినిధులు హాజరై చివరి సంవత్సరం విద్యార్థులకు రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించారు. అందులో ప్రతిభకనబర్చిన 23 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు కళాశాల కరస్పాండెంట్ ఎం సుబ్బారెడ్డి తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ ఏ శ్రీనివాసులురెడ్డి, డైరెక్టర్ డీ ప్రసాద్, అధ్యాపకులు ఏ రామ్మోహన్, డీ వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఉదయగిరి: స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి డిగ్రీ కళాశాలలో నూతన భవన నిర్మాణానికి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ గురువారం శంకుస్థాపన చేయనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. నూతన భవన నిర్మాణం కోసం రూ.3.5 కోట్లు, తరగతి గదుల మరమ్మతులకు రూ.75 లక్షలు, ల్యాబ్ పరికరాల కోసం మరో రూ.75 లక్షలను మంజూరు చేసినట్లుగా వివరించారు.

104 వాహన సేవలు

వరికుంటపాడు: మండలంలోని రామాపురం హరిజనవాడలో 104 వాహన సేవలను బుధవారం అందజేశారు. వైద్యాధికారిని కరీష్మా 45 మందిని పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు.

సన్మానం



కొండాపురం: మండలంలోని కొమ్మిలోని పశువైద్యశాల సబ్‌సెంటర్‌లో లైవ్‌స్టాక్ అధికారిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన వైఎస్ శేషగిరిని రామానుజపురం గ్రామానికి చెందిన పాడి రైతులు బుధవారం ఘనంగా సన్మానించారు. లైవ్‌స్టాక్ అధికారిగా శేషగిరి పాడి పరిశ్రమ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని పలువురు రైతులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో కొండ్రాజు వెంకటేశ్వర్లు, గుమ్మ శ్రీనివాసులు, బెల్లం నరసింహరావు, కొండ్రాజు ఎర్రయ్య, కొండ్రాజు వెంకటేశ్వర్లు, ఆకుల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన

ఉదయగిరి: ఉదయగిరిలోని గ్రామ సచివాలయం-2,3ల్లో వైద్యాధికారిణి శివకల్పన కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను బుధవారం నిర్వహించారు. అనంతరం కేన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. రొమ్ము, నోటి, గర్భాశయ కేన్సర్ల లక్షణాలను వివరించారు. కేన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే నయం చేయవచ్చని తెలిపారు. ఎవరికైనా కేన్సర్ అనుమానిత లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి సకాలంలో చికిత్స పొంది నివారించుకోవాలని సూచించారు. హెల్త్ ఎడ్యుకేటర్ కలసపాటి వెంకటసుబ్బయ్య, హెల్త్ సూపర్‌వైజర్ అంకమ్మ, ఏఎన్ఎం నూర్జహాన్, తదితరులు పాల్గొన్నారు.

అమరా బచ్చు ట్రస్టు సేవలు అభినందనీయం


పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

అల్లూరు: అమరా బచ్చు ట్రస్టు సేవలు అభినందనీయమని కావలి ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. గోగ్లపాళెంలోని బాలల ఆశ్రమంలో అమరా బచ్చు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించిన ఆశ్రమ పాఠశాల భవనాన్ని బుధవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ్రమంలోని బాలల ఉజ్వల భవిత కోసం బచ్చు వెంకట కృష్ణయ్య పేరుపై అమరా బచ్చు ట్రస్టు నిర్వాహకులు బచ్చు కృష్ణకుమార్, సంధ్య పాఠశాల భవనాన్ని నిర్మించడం అభినందనీయమన్నారు. ఎంతో మంది పిల్లలకు భవిష్యత్తును అందజేస్తున్న ఆశ్రమం నిర్వాహకుడు రామచంద్ర శరత్ బాబును అభినందించారు.

వెంగమాంబ సన్నిధిలో బహిరంగ వేలం పాటలు

దుత్తలూరు: నర్రవాడలోని వెంగమాంబ పేరంటాలు దేవస్థానంలో దేవాదాయశాఖ ఆధ్వర్యంలో వివిధ హక్కులకు బహిరంగ వేలం పాటలు, టెండర్లను బుధవారం నిర్వహించారు. తలనీలాలు పోగు హక్కును బాపట్ల జిల్లా అద్దంకికి చెందిన సుబ్బరాయుడు రూ.16.10లక్షలకు దక్కించుకున్నాడు. ఎండుకొబ్బరి అమ్ముకునే హక్కును నర్రవాడకు చెందిన నక్క నాగభూషణం రూ.9.60 లక్షలకు దక్కించుకున్నాడు. కూరగాయల సరఫరా హక్కును టెండర్ ద్వారా యు. వెంకటాద్రి, ప్రింటింగ్ హక్కును నెల్లూరు గణేష్ గ్రాఫిక్స్ వారు దక్కించుకున్నారు. కొబ్బరికాయలు, పూజా ద్రవ్యాలు అమ్ముకునే హక్కు, కొబ్బరి చిప్పలు పోగు హక్కు, అమ్మవారి చీరలు, రవికలు సేకరించి విక్రయించుకునే హక్కు, పొంగలి షెడ్డు నందు గ్యాస్ స్టౌలు అద్దెకు ఇచ్చుకునే హక్కు, పండ్లు, పూలు, పూలమాలలు అమ్ముకునే హక్కు, పాదరక్షలు భద్రపరుచుకునే హక్కు, పుష్పాలు, పాలు, పెరుగు, అభిషేక సామగ్రి సరఫరా చేసే హక్కు, విద్యుత్ మరియు ప్లంబింగ్ సామగ్రి సరఫరా, వస్త్రాల సరఫరా, వంట చెరకు సరఫరా, గోశాలకు వరిగడ్డి సరఫరా చేయుట తదితర హక్కులు వాయిదా పడ్డాయి. తిరిగి వాటికి వేలం, టెండర్లు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఉషశ్రీ తెలిపారు. ఆలయ చైర్మన్ తుమ్మలవెంకట సురేష్‌బాబు, పూడిపర్తి రామలింగేశ్వరస్వామి ఆలయ ఈఓ ఎన్ శ్రీధర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.


వేలం పాటలు నిర్వహిస్తున్న దేవాదాయ శాఖ అధికారులు

తపాలా కార్యాలయానికి తాళం



అల్లూరు: స్థానిక తూర్పువీధిలో ఓ అద్దె ఇంట్లో నిర్వహిస్తున్న తపాలా శాఖ కార్యాలయానికి ఆ ఇంటి యజమాని బుధవారం తాళం వేశారు. రెండు, మూడేళ్లుగా ఇంటిని ఖాళీ చేయాలని యజమాని కోరుతున్నా తపాలా సిబ్బంది స్పందించకపోవడంతో సహనం కోల్పోయిన ఆయన గేటుకు తాళం వేశారు. దీంతో తపాలా కార్యాలయానికి వచ్చిన వివిధ సేవల నిమిత్తం వచ్చిన ప్రజలు తాళం వేసి ఉండడం చూసి ఇబ్బందులకు గురయ్యారు.

ఆశీర్వచనం

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులో బుధవారం జరిగిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గణపం రమేష్‌రెడ్డి సోదరుడి కుమార్తె మాధురి వివాహ నలుగు కార్యక్రమానికి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి హాజరై వధువును ఆశీర్వదించారు. ఆయన వెంట స్థానిక నాయకులు మద్దూరి చిన్నికృష్ణారెడ్డి, బాలకృష్ణ, కాలేషా, తదితరులు ఉన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఏరిస్ ఆగ్రోలిమిటెడ్, రీల్ ఇండియా లిమిటెడ్, అమరరాజా బ్యాటరీస్, గ్రీన్‌టెక్, తదితర కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరై నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 60 మందికిపైగా అభ్యర్థులు హాజరవగా, 26 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ అబ్దుల్ ఖయ్యూం తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీనివాస రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సొసైటీ మాజీ అధ్యక్షుడు కల్లూరు మృతి

అనుమసముద్రంపేట: మండలంలోని హసనాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, రాజవోలు సొసైటీ మాజీ అధ్యక్షుడు కల్లూరు ప్రభాకర్‌రెడ్డి (45) గుండెపోటుతో మంగళవారం అర్ధరాత్రి మృతి చెందారు. ప్రభాకర్‌రెడ్డికి భార్య కౌసల్య, మూడేళ్ల కుమారుడు ఉన్నారు. ప్రభాకర్‌రెడ్డి మృతి విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రభాకర్‌రెడ్డి మృతదేహాన్ని జెడ్పీటీసీ పందిళ్లపల్లి రాజేశ్వరమ్మ, సంగం నాయకులు కంటాబత్తిన రఘునాథరెడ్డి, ఏఎస్‌పేట నాయకులు అంబటి కోటిరెడ్డి, జనార్దన్‌రెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, కాటంరెడ్డి నారసింహరెడ్డి, తదితరులు సందర్శించి నివాళులర్పించారు.


పీహెచ్‌సీ తనిఖీ

చేజర్ల: చిత్తలూరు పీహెచ్‌సీని డీఎల్ఏటీఓ, ఆత్మకూరు డివిజన్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ షేక్ ఖాదర్‌వలీ బుధవారం తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేసి వైద్యసిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం ఆదూరుపల్లిలోని గురుకుల పాఠశాలను సందర్శించి వంటగదిని పరిశీలించి, వసతులపై ఆరాతీశారు. విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. ఆయన వెంట పీహెచ్‌సీ వైద్యులు నవీన్‌కుమార్‌రెడ్డి, జిల్లా ప్రోగ్రాం కో ఆర్డినేటర్ విజయ్, ఎస్‌టీఎల్ఎస్ శ్రీనివాసులు, పీహెచ్‌సీ సిబ్బంది ఉన్నారు.

రీసర్వే పరిశీలన

దుత్తలూరు: రాచవారిపల్లిలో జరుగుతున్న భూముల రీ సర్వేను తహసీల్దార్ యనమల నాగరాజు బుధవారం పరిశీలించారు. సర్వే సిబ్బందికి సూచనలు చేశారు. ప్రభుత్వం రీసర్వే ద్వారా భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందన్నారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని భూసమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. రీసర్వే సమయంలో రైతులందరూ అందుబాటులో ఉండాలన్నారు.

వైభవంగా ఆదిదంపతుల కల్యాణం



సీతారామపురం: స్థానిక రామలింగేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. పార్వతి, పరమేశ్వరుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు. గత మూడేళ్లుగా లోక క్షేమం కోసం పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.

ఎల్ఐసీ ఉద్యోగుల నిరసన



ఆత్మకూరు: ఆల్ ఇండియా ఇన్స్యూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్, ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ సంయుక్త పిలుపు మేరకు పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయం ఎదుట ఉద్యోగులు బుధవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఎల్ఐసీలోని 3, 4వ తరగతుల ఉద్యోగ నియామకాలను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎల్ఐసీ బ్రాంచ్ సీనియర్ మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు.